ఎడతెరిపి లేని వర్షం

● లోతట్టు ప్రాంతాలలో నిలిచిన నీరు ● ఇబ్బందులు పడిన జనం

రాంనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం ముసురు కురిసింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఉదయం ఆఫీసులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పలు రహదారులు, అంతర్గత రోడ్లలో నీరు నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలలో వర్షం నీరు నిలిచి పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. వీఎస్టీ చౌరస్తా, ఆజామాద్ చౌరస్తా, అశోక్‌నగర్ బ్రిడ్జి, ప్రాగా టూల్ చౌరస్తా, బాకారం చౌరస్తాలో వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని ఛే నంబర్ చౌరస్తా, తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి, గోల్నాక, టూరిస్ట్ హోటల్ చౌరస్తా, లింగంపల్లి చౌరస్తా తదితర ప్రాంతాలలో నిలిచిన వర్షం నీరుతో వాహనదారులు, పాదచారులు పలు ఇక్కట్లకు గురయ్యారు. వర్షం నిలిచిన పలు చోట్ల జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ సిబ్బంది వర్షం నీరు నిలువకుండా తగు చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు వర్షంపై పలు చర్చించి పలు చర్యలు చేపట్టారు.



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిలిచిపోయిన వర్షం నీరు



గంగపుత్ర కాలనీలో పారిశుధ్య పనులు చేపడుతున్న జీహెచ్ఎంసీ సిబ్బంది





ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలలో వర్షానికి ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



వర్షంలో గొడుగు పట్టుకుని స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు



అంబర్‌పేట మహాకాళి బోనాలకు హాజరు కావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

బోనాలకు రావాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానం

నల్లకుంట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మహాకాళి అమ్మవారి ఆలయంలో ఈ నెల 28న జరిగే బోనాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఆలయ కమిటీ ముఖ్య సలహాదారులు కె. దుర్గాప్రసాద్‌రెడ్డి, చైర్మన్ పి. జ్ఞానేశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, కోశాధికారి గండం శ్రీధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ చెంగలి సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దొమకొండ కిషోర్, పంజాల వెంకటేష్‌గౌడ్, సునీల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తిలక్‌నగర్ చౌరస్తాలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి తదితరులు

లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా చర్యలు

● కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

నల్లకుంట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి బాగ్అంబర్‌పేట డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సూచించారు. శనివారం జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా తిలక్‌నగర్ చౌరస్తాతో పాటు పలు చోట్ల వర్షం నీటి పూడికతీత పనులను సిబ్బందిచే దగ్గరుండి చేయించారు. కార్యక్రమంలో ఏఈ మనీషా, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, బీఆర్ఎస్ నాయకులు మిరియాల శ్రీనివాస్, జమ్మిచెట్టు బాలరాజు, వెంకటరమణ రాజు, ట్యూషన్ శేఖర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



టాపర్‌కు గోల్డ్ మెడల్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్ బీజే రావు

యువ గ్రాడ్యుయేట్లు పరిశోధనలపై దృష్టి సారించాలి

● సెంట్రల్ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు

బర్కత్‌పుర, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యువ గ్రాడ్యుయేట్స్ పరిశోధనలపై దృష్టి సారించాలని సెంట్రల్ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు పిలుపునిచ్చారు. పరిశోధన ఫలితాలు గ్రామాలకు చేరినప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. శనివారం విజ్ఞాన భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీబీఐటీ) 17వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘట్‌కేసర్‌లోని కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్ట్‌తోపాటు ఇతర అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా టాపర్లకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన క్విక్‌హీల్ టెక్నాలజీస్ లిమిటెడ్ చీఫ్ ప్రొడెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ లలిత్ మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలకు మరింత పదును పెట్టాలని ఆమె కోరారు. వీబీఐటీ చైర్మన్ డాక్టర్ ఎన్ గౌతమ్‌రావు, కార్యదర్శి డాక్టర్ జి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదవడం వల్లనే గోల్డ్ మెడల్స్ సాధించారని అదే పట్టుదలతో ముందుకు సాగుతూ జీవితంలో రాణించాలని వారు కోరారు. కార్యక్రమంలో కళాశాల పాలకమండలి సభ్యులు భానుప్రకాష్ వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్ శ్రీనివాస్, గ్రాడ్యుయేషన్ డే ప్రోగ్రాం కన్వీనర్ సతీష్‌కుమార్, కో కన్వీనర్ డాక్టర్ పూర్ణలక్ష్మి, డైరెక్టర్లు ప్రొఫెసర్ ప్రసాదరావు, ప్రొఫెసర్ అమరేందర్‌రావు, ప్రొఫెసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాట్యగురు అంజుబాబుకు గౌరవ డాక్టరేట్

చిక్కడపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథక్ కళాకారుడు, నాట్యగురు, కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడు ఎర్రంశెట్టి అంజుబాబుకు అమెరికన్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఐదు దశాబ్దాలుగా కథక్ నాట్యంలో చేస్తున్న విశేష సేవలను గుర్తించి అమెరికా మేరీల్యాండ్‌లోని సౌత్ వెస్ట్రన్ అమెరికన్ యూనివర్శిటీ భారతదేశం నుంచి అంజుబాబును ఎంపిక చేసింది. శనివారం ఆ యూనివర్శిటీ ట్రస్టీ డా. ఎల్విస్ విలియం నుంచి ఉత్తర్వులు అందినట్లు అంజుబాబు తెలిపారు. ఈ నెల 24న ఢిల్లీలో ఆయనకు గౌరవ డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేయనున్నారు. అమెరికా యూనివర్శిటీ తనను గుర్తించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు అంజుబాబు సంతోషం వ్యక్తం చేశారు.



మంచినీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్ రమేష్, డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి

పాఠశాల పనులను పూర్తి చేసేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా

● అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్ రమేష్

ముషీరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి అయ్యేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్ రమేష్ అన్నారు. శనివారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను రమేష్ సందర్శించి పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు నిలిచిపోవడంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది కలిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో భాగంగా విద్యార్థులకు మెరుగైన మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం, తరగతి గదుల్లో విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు నరేందర్ యాదవ్, రతన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇందిరాపార్కు వద్ద వడ్డెరల ఒకరోజు దీక్ష

రాంనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో వడ్డెర కులస్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తెలంగాణ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ సోమవారం ఇందిరాపార్కు వద్ద వడ్డెరలు ఒకరోజు దీక్ష నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభించిన విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని ఆరోపించారు. వడ్డెర కులస్థుల సంక్షేమం కోసం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ప్రభాకర్ తదితరులు

సాధన స్రవంతి పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సంగీత శిక్షణతో సంస్కారం అలవడుతుందని ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. ఎస్ ఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసులు గరికపాటి ప్రభాకర్ రచించిన సాధన స్రవంతి రెండు భాగాలు పుస్తకావిష్కరణ సభ శనివారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామలింగేశ్వరరావు సంపుటిలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభాకర్ రచించిన సాధన స్రవంతి సంపుటిలు సంగీతాన్ని సులభతరంగా నేర్చుకోవచ్చన్న అవగాహన కలిగిస్తుందన్నారు. మృదంగ వాయిద్య నిపుణులు రామచంద్రశర్మ మాట్లాడుతూ ప్రభాకర్ సినిమా సంగీతంలోకి వెళ్లకుండా శాస్త్రీయ సంగీత ప్రచారం చేస్తున్నారని అభినందించారు. చిత్రకారిణి నీలిమ సభలో పాల్గొన్నారు. తొలుత రాగాలయ, స్వరాలయ సంస్థలకు చెందిన విద్యార్థులు శాస్త్రీయ సంగీత ఆలాపనను మధురంగా నిర్వహించారు.



రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్‌గా నియమితులైన సాయి కుమార్‌ను సన్మానిస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు

రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్ సాయికుమార్‌కు సన్మానం

కవాడిగూడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్‌గా నియమితులైన మెట్టు సాయికుమార్‌ను శనివారం జరిగిన ఆత్మీయ సత్కారంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర మహిళా సంఘం అధ్యక్షురాలు రాచమళ్ల స్వర్ణలత, ప్రధాన కార్యదర్శులు సంగీత, మంగినపల్లి సునీత, గంగపుత్ర సంఘం నాయకులు అంబటి మల్లయ్య సుధాకర్‌గంగపుత్ర, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు. అనేక సంవత్సరాల తరువాత మత్స్యశాఖ చైర్మన్‌గా గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన మెట్టు సాయికుమార్ నియమితులు కావడం సంతోషంగా ఉందని వారు అన్నారు. గంగపుత్రుల సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు ఆకాంక్షించారు.

విద్య, వైద్యానికి అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ పెద్దపీట

● ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యా, వైద్యానికి అంతర్జాతీయ ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) పెద్ద ఎత్తున సేవలు అందిస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలుస్తున్నదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో ఐవీఎఫ్ 11వ వార్షికోత్సవం, ముషీరాబాద్ నియోజకవర్గం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేసిన వివిధ జిల్లాలకు చెందిన వారికి సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు అన్నారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యుల అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నదని అన్నారు. అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన కమిటీ సీనియర్‌నాయకుడు ముఠా జైసింహా, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, సరస్వతి, దేవాలయ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు నారాయణ, రవి, స్వప్న, అజయ్‌గుప్తా, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ కమిటీ నేతలచే ప్రమాణస్వీకారం చేయించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎంపీ అనిల్ కుమార్

ఎస్సీ, ఎస్టీ కుల సంఘాలన్నీ ఏకం కావాలి

● సదస్సులో పలువురు వక్తల పిలుపు

రాంనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు, జాతులపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాల నివారణ కోసం ఎస్సీ, ఎస్టీ కుల సంఘాలన్నీ ఏకం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ ఆధ్వర్యంలో కారంచేడు, చుండూరు, లక్ష్మీపేట మృతవీరుల సంస్మరణ సభ సొసైటీ అధ్యక్షుడు పల్లె వీరస్వామి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న పలు సామాజిక వేత్తలు, సంఘాల నాయకులు ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ నతానేయులు, అప్పికట్ల భరత్‌భూషణ్, జి. శంకర్, ఆరేపల్లి రాజేంద్ర, మహేష్‌రాజు, భీమ శ్రీనివాస్, నల్లా రాధాకృష్ణలు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో దళిత బిడ్డ పుట్ట మధుకర్‌ను హత్య చేశారని పేర్కొన్నారు. నేరెళ్ల గ్రామంలో ఇసుక దొంగలను అడ్డుకున్నందుకు బీఆర్ఎస్ నేతలు ఇద్దరు మాదిగ యువకులను పాశవికంగా పోలీసులచే దాడి చేయించారని ఆరోపించారు. మాల, మాదిగలపై జరుగుతున్న అగ్రవర్ణాల హత్యలు, అత్యాచారాలు, దాడులను అరికట్టేందుకు దళిత సంఘాలు ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు.



సదస్సులో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ కాశీం భరత్‌భూషణ్, పల్లె వీరస్వామి, ఆరేపల్లి రాజేంద్ర, శంకర్ తదితరులు

నకిలీ బంగారం విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

● రూ.28.5 లక్షల నగదు, 20 తులాల నకిలీ బంగారు నాణేలు స్వాధీనం

జీడిమెట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకే మేలిమి బంగారమంటూ అమాయకులను మోసం చేస్తూ, నకిలీ బంగారం విక్రయించడానికి యత్నించిన ఓ ముఠా సభ్యులు ముగ్గురిని బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 28.5 లక్షల నగదు, 20 తులాల బరువు కలిగిన 100 నకిలీ బంగారు నాణేలు, 6 సెల్‌ఫోన్‌లు, కారు స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఉప్పల్‌కు చెందిన యాషాల కామేశ్వరరావు అలియాస్ వల్లకంటి రాజు, అలియాస్ మహేష్, గుంటూరుకు చెందిన వేముల పుల్లారావు, పల్నాడుకు చెందిన బత్తుల సాంబశివరావులు ముఠాగా ఏర్పడి నకిలీ బంగారం విక్రయిస్తున్నారు. అంతేకాక దొంగనోట్లను కూడా చెలామణీ చేస్తున్నారు. విజయవాడకు చెందిన మహేష్ అనే వ్యక్తి తక్కువ ధరకే బంగారం విక్రయిస్తున్నాడని వికారాబాద్ మండలం, తాండూరుకు చెందిన కె.అంజలికి అదే ప్రాంతానికి చెందిన సంధ్య తెలిపింది. అతడి ఫోన్ నెంబర్‌కు కూడా ఇచ్చింది. దీంతో అంజలి మహేష్‌కు ఫోన్‌చేసి బంగారం కావాలని అడగటంతో 10 వేలకే తులం అమ్ముతామని చెప్పాడు. విజయవాడ రావాలని చెప్పడంతో తాను అంతదూరం రాలేనని చెప్పి ఫోన్ కట్ చేసింది. ఈనెల 18న మహేష్ అంజలికి ఫోన్‌చేసి తనవద్ద అరకిలో బంగారు నాణేలు ఉన్నాయని మొత్తం కొనుగోలు చేస్తేనే ఇస్తానని చెప్పాడు. దీంతో ఆశపడిన అంజలి బానురేఖ, ప్రభావతిలకు చూడా చెప్పడంతో వారు కూడా కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యారు. స్థానికంగా బంగారు పనులు చేసే ప్రవీణ్, బసవ అనే వ్యక్తులను తీసుకుని ఈనెల 19వ తేదీ సాయంత్రం 7 గంటలకు జీడిమెట్ల లోని శుభం హోటల్‌కు వచ్చారు. మహేష్ ఫోన్‌చేసి రూమ్‌నెంబర్ 306లో ఉన్నామని, మగవాళ్లను మాత్రమే పంపించమనడంతో నగదు ఇచ్చి ప్రవీణ్, బసవలను పంపించారు. ఆతర్వాత ఆడవాళ్లు కూడా రావాలని అంజలికి మహేష్ మెసేజ్ పెట్టడంతో ముగ్గురు అక్కడికి వెళ్లారు. అప్పటికే పక్కా సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ఓటీ, జీడిమెట్ల పోలీసుల దాడులు నిర్వహించి ముఠాలోని ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేశారు. వారి నుంచి బంగారు నాణేలు, నగదు, స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో బాలానగర్ ఎస్ఓటీ డీసీపీ డి.శ్రీనివాసులు, అడిషనల్ డీసీపీ పి.శోభన్‌కుమార్, ఏసీపీ జి.హన్మంతరావు, జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ పాల్గొన్నారు.



నకిలీ బంగారు నాణాలను పరిశీలిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

యువకుడి అదృశ్యం

హైదర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాప్ ఎంఐజీ-870లో నివాసం ఉండే సతీష్‌కుమార్(33) ఐకాన్‌వేవ్‌లో నెట్‌వర్క్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి తన బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కాల్ చేస్తే ఫోన్ అందుబాటులో లేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, స్నేహితులను విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో సోదరుడు ఉమేష్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు.



సతీష్‌కుమార్

ఆర్టీసీని ప్రభుత్వ విలీనం చేసే డేట్ ప్రకటించాలి

రాంనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశంలో ఆర్టీసీని ప్రభుత్వ విలీనం చేసే డేట్ ప్రకటించాలని ఐఎన్‌టీయూసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ కోరారు. శనివారం విద్యానగర్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన కొద్ది నెలలోనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంచాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆర్టీసీ ఏకపక్షంగా మద్దతు ఇచ్చిందన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

టీపీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర సంయుక్త కన్వీనర్‌గా సంతోష్

చిక్కడపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర సంయుక్త కన్వీనర్‌గా గాంధీనగర్ డివిజన్‌కు చెందిన న్యాయవాది పాక సాయి సంతోష్ నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియామకపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సాయి సంతోష్ మాట్లాడుతూ ప్రజల్లో న్యాయవ్యవస్థపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి కృషి చేస్తానన్నారు.



సాయిసంతోష్‌కు నియామకపత్రం అందజేస్తున్న అశోక్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆరె మహేందర్

బడ్జెట్‌లో జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించాలి

● తెలంగాణ బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

రాంనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని తెలంగాణ బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి బీసీల స్వయం సమృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి కూడా 23 నుంచి జరిగే బడ్జెట్ సమావేశంలో బీసీలకు 20 వేల కోట్ల రూపాయలతో సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. బీసీల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు రూపొందించి వడ్డీలేని రుణాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు దశరథం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కార్పొరేటర్

చిక్కడపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ వీవీ గిరినగర్ కమ్యూనిటీహాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లలకు అందుతున్న సదుపాయాలు, అంగన్‌వాడీ టీచర్, ఆయాల విధుల నిర్వహణపై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అంగన్‌వాడీ టీచర్ ప్రమీలతో మాట్లాడుతూ పిల్లలకు అందుతున్న పౌష్టిక ఆహారాన్ని సరైన తీరులో అందజేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సదుపాయాలు అందకపోతే వెంటనే తన దృష్టికి తేవాలని కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, పార్టీ నేతలు సాయికుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

మొబైల్‌ఫోన్‌లను జాగ్రత్తగా చూసుకోవాలి

● ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లను జాగ్రత్తగా చూసుకోవాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సూచించారు. చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బాధితులు పోగొట్టుకున్న 150 సెల్‌ఫోన్‌లు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి వారికి అందజేశామని ఆయన తెలిపారు. టి.నాగిరెడ్డి అనే యువకుడు 20 రోజుల కిందట పోగొట్టుకున్న విలువైన మొబైల్‌ఫోన్‌ను రికవరీ చేసి శనివారం ఆయనను స్టేషన్‌కు పిలిపించి మొబైల్ అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు తన ఫోన్‌ను తనకు ఇప్పించడంతో సంతోషం వ్యక్తం చేశారు.



నాగిరెడ్డికి మొబైల్ ఫోన్ అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్

అంగన్‌వాడీలలో మూడో తరగతి వరకు నిర్వహించొద్దు

● టీఎస్ యూటీఎఫ్

కవాడిగూడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను ప్లే స్కూల్‌గా మార్చి మూడో తరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదనసరైంది కాదని దీనిని తక్షణమే విరమించుకోవాలని టీఎస్ యూటీఫ్ డిమాండ్ చేసింది. అంగన్‌వాడీలను ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు గుర్తించడం లేదని 1, 2 3 తరగతులను అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగించడం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకే దోహద పడుతుందని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జంగయ్య, చావ రవి అన్నారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలనే ప్రతిపాదన ఆహ్వానించదగినదని ఎంపిక చేసిన పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్, సబ్జెక్ట్‌కు ఒక టీచర్, ప్రధాన ఉపాధ్యాయులు తగినంత బోధనేతర సిబ్బంది పాఠశాలలో ఉండేలా చూడాలని వారు సూచించారు.